సాక్షి
వికారాబాద్
శుక్రవారం । 29 । మార్చి । 2024



మహిమాన్వితం..

కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల రామ లింగేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబయ్యింది. 11లో▸



రూ.2 కోట్ల రుణాలు

రైతులకు రూ. 2కోట్ల రుణాలు ఇవ్వనున్నట్లు పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. 11లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
6:34	4:50

న్యూస్‌రీల్

నూతన నియామకం



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించిన న్యాయవాదులు

తాండూరు టౌన్: తాండూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా అగ్గనూర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గుండప్ప, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎండీ ఫరీద్, కోశాధికారిగా బీ రవికుమార్, కార్యవర్గ సభ్యులుగా రామ్మోహన్, ఆంజనేయులు, కలామ్, మహిళా ప్రతినిధిగా సోఫియాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ నూతన సభ్యులను న్యాయవాదులు పూలమాలలో సన్మానించారు. అనంతరం అగ్గనూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్



శ్రీనివాస్‌యాదవ్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు

పరిగి: పరిగి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా భక్త కుమార్ ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, గౌస్ పాషాల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ సాగింది. మొత్తం 45 మంది ఓటింగ్‌లో పాల్గొనగా అధ్యక్షుడిగా శ్రీనివాస్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా భక్త కుమార్ గెలుపొందారు. అనంతరం వారు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు లింగం, ఆనంద్ గౌడ్, బాల ముకుందం, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

చెంగిచర్ల ఘటనపై ప్రభుత్వం స్పందించాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకట్

తాండూరు టౌన్: హైదరాబాద్‌లోని చెంగిచర్లలో దళిత, గిరిజన, హిందూ మహిళలపై జరిగిన దాడి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి జుంటుపల్లి వెంకట్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహిళలపై ఓ వర్గానికి చెందిన యువకులు దాడి చేసి రెండు రోజులు గడుస్తున్నా నిందితులను ఇంత వరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. దళిత, గిరిజన మహిళలపై దాడికి దిగిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

‘ఉపాధి’లో మనమే టాప్

డీఆర్‌డీఓ శ్రీనివాస్

అనంతగిరి: ఉపాధి హామీ పథకం అమలులో రాష్ట్రంలోనే మనం మొదటి స్థానంలో నిలిచినట్లు డీఆర్‌డీఓ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ శాతం మంది కూలీలకు పనులు కల్పించడం, అత్యధిక కుటుంబాలకు 100రోజులు పని కల్పించడం, అత్యధిక సగటు పని దినాలు, అత్యధిక సగటు వేతనం పొందడం, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర స్థాయిలో ఎక్కువ పాయింట్లు సాధించి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు కూలీలకు రూ. 114.83 కోట్లు, మెటీరియల్ రూ.75.93 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. 799 సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.60.73కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఉపాధి పనుల్లో అగ్రగామిగా నిలవడానికి కృషి చేసిన ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీఓలు, ఎంపీడీఓలు, డీఆర్‌డీపీ కార్యాలయ సిబ్బందికి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అభినందనలు తెలియజేశారు.

నేడు షాద్‌నగర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

షాద్‌నగర్: పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఉన్న కుంట్లరాంరెడ్డి గార్డెన్‌లో శుక్రవారం బీజేపీ నాయకుల సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ హాజరుకానున్నట్లు పార్టీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు భారీ ఎత్తున బీజేపీలో చేరనున్నట్లు చెప్పారు.

కొడంగల్‌ను పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తా

ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందు నిలుపుతా

- ఎంపీ ఎన్నికల తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు కృషిచేస్తా
- ఏప్రిల్ 8న మళ్లీ వస్తా
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కొడంగల్: లోక్‌సభ ఎన్నికల తరువాత కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు తీయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో గురువారం ఓటు వేయడానికి కొడంగల్‌కు వచ్చారు. అనంతరం పట్టణంలోని తన నివాసంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. త్వరలో కొడంగల్‌కు సిమెంట్ పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. గతంలో రూ.5 వేల కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత మరిన్ని నిధులతో కొడంగల్‌ను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు రాయి నిల్వలు ఉన్నాయన్నారు. గతపాలకుల నిర్లక్ష్యం కారణంగా పరిశ్రమలు రాలేదన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తే భూముల విలువ పెరుగుతుందని, కొడంగల్‌కు ఫార్మా కంపెనీలు వస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

భూ సేకరణకు సహకరించాలి

భూ సేకరణకు సహకరిస్తేనే పరిశ్రమలు ఏర్పాటు చేయడం సులభతరం అవుతుందన్నారు. భూములు కోల్పోయిన వారికి న్యాయమైన ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పారు. ఎవరికీ అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. పట్టా భూములకు ఇచ్చే ధరను అసైన్‌మెంట్ భూములకు కూడా ఇస్తామన్నారు. ఏది జరిగినా ప్రేమతో జరగాలన్నారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన కొడంగల్ ప్రజలకు అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఏప్రిల్ 8న కొడంగల్‌కు మళ్లీ వస్తానని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం తాను ఎంతో శ్రమిస్తున్నట్లు చెప్పారు. కోస్గి పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండల కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కొడంగల్ మండలం అప్పాయిపల్లిలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాలను మంజూరు చేసినట్లు చెప్పారు. కొడంగల్ ప్రభుత్వాస్పత్రిని విస్తరించి 220 పడకల సామర్థ్యం కలిగిన టీచింగ్ ఆస్పత్రిగా మారుస్తున్నట్లు చెప్పారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతలకు రూ.2945 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు, పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కొడంగల్‌లోని శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీ గెలవడంతోనే అభివృద్ధి సాధ్యమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందర్ రెడ్డిని గెలిపించాలన్నారు. నియోజకవర్గంలో 50 వేలకు పైగా మెజారిటీ రావాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు నాయకులు పని చేయాలని సూచించారు. బూత్, మండలాలు, నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు సభ్యులతో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

6న తుక్కుగూడలో సమర శంఖారావం

ఏప్రిల్ 6వ తేదీ సాయంత్రం 5 గంటలకు తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ సమర శంఖారావం సభకు నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచందర్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, పార్టీ నాయకులు శ్రీరాంరెడ్డి, మహ్మద్ యూసుఫ్, నందారం ప్రశాంత్, మురహరి వశిష్ట పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



పరిగిలో నిలిచిపోయిన వాహనాలు

పరిగి: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ నేపథ్యంలో గురువారం కొడంగల్‌లో ఓటు వేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో వెళ్లారు. ఓటు వేసి తిరుగు ప్రయాణంలో ఉండగా పరిగిలో పోలీసులు ఎక్కడి వాహనాలను అక్కడ నిలిపివేశారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. గంటపాటు రోడ్డుపై ఎండలో ప్రయాణికులు నిలుచోవాల్సి వచ్చింది. దీంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మూడు కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పోలింగ్ ప్రశాంతం

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓటు వేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- పర్యవేక్షించిన కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్: మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా జరిగింది. వంద శాతం పోలింగ్ జరిగినట్లు ప్రిసైడింగ్ అధికారి తెలిపారు. ఎక్స్ అఫీషియో హోదాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎంపీడీఓ కార్యాలయంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి ఎన్నిక సరళిని పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రంలో ఏజెంట్లు, సిబ్బందితో మాట్లాడారు. కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు సంబంధించి మొత్తం 56 ఓట్లు పోలయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ తన బిజీ షెడ్యూల్‌ను సైతం పక్కన పెట్టి రోడ్డు మార్గంలో మధ్యాహ్నం రెండు గంటలకు కొడంగల్‌కు చేరుకున్నారు. నేరుగా ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేశారు. అనంతరం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి ముఖ్యమంత్రికి శాలువా, పూలదండలతో సత్కరించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సీఎం పట్టణంలోని లాహోటీ కాలనీలో ఉన్న ఆయన నివాసానికి వెళ్లారు. పర్సాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ గోవిందమ్మ తన చంటిబిడ్డను ఎత్తుకొని పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు. సుల్తాన్‌పూర్ ఎంపీటీసీ 80 ఏళ్ల వృద్ధురాలు కిష్టమ్మ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేశారు.



చంటిబిడ్డతో ఓటు వేసి బయటకు వస్తున్న ఎంపీటీసీ గోవిందమ్మ

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో (నాదర్‌గుల్) ఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్టేట్ సర్వీసెస్, గ్రూప్స్, బ్యాంకింగ్ సర్వీసెస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలకు ఫౌండేషన్ కోర్సుల్లో 100 మందికి మూడు నెలల పాటు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గతంలో స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవొద్దన్నారు. ఈనెల 30 వరకు స్పాట్ అడ్మిషన్ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. డిగ్రీ మార్కుల ద్వారా కేటాయింపు ఉంటుందన్నారు. ఎంపికైన వారు కుల, ఆదాయ, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 94405 21419, 81215 09153 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు


- వ్యాపారం కోసమే ఆఫ్రికా వెళ్లా
- కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ఊరూరా తిరిగి ప్రచారం చేస్తా
- మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు/తాండూరు రూరల్: నేను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వదంతులను నమ్మరాదని, బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి స్పష్టం చేశారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో బీఆర్‌ఎస్ మండల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. ఆయనకు మద్దతుగా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. మూడు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర సమస్యలు వినిపించాలంటే కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని నాయకులకు పిలుపునిచ్చారు. వ్యాపార నిమిత్తం తరచూ ఆఫ్రికా వెళ్లాల్సి ఉంటుందని, నేను అందుబాటులో లేకపోయినా ఇక్కడ బాబాయ్ శ్రీశైల్‌రెడ్డి అన్నీ చూసుకుంటారని తెలిపారు. కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ఊరూరా తిరిగి ప్రచారం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాజప్పగౌడ్, వీరేందర్‌రెడ్డి, గౌడి వెంకటేశం, సురేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాంలింగారెడ్డి, ఉమాశంకర్, అంతారం రాములు, రాకేష్‌గౌడ్, ప్రశాంత్‌గౌడ్, వసంత్‌కుమార్, అశోక్‌కుమార్, జైపాల్‌రెడ్డి, నరేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.

నీటి సమస్య రావొద్దు

- అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: జిల్లాలో మంచి నీటి సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. గురువారం మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్ వెల్స్, చేతి పంపులు పని చేయకపోతే ఏప్రిల్ 5వ తేదీలోపు మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనివార్య కారణాల వల్ల మిషన్ భగీరథ నీరు నిలిచిపోతే ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, పంచాయత్ రాజ్, మున్సిపల్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాబు శ్రీనివాసు, నాగేశ్వరరావు, మిషన్ భగీరథ ఏఈలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పూడూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉంటేనే యావత్ దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని, మారుమూల గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా గురువారం మండలంలోని మిట్టకంకల్, కడుమూరు, మేడిపల్లికలాన్, పెద్ద ఉమ్మెంతాల్, కంకల్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోదీ నాయకత్వంతో గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడపకూ తెలియజేయడం కోసం యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మూడోసారి మోదీని ప్రధాన మంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు. పదేళ్ల పాలనలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణను అప్పులపాలు చేసిందని ఆరోపించారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. చేవెళ్ల గడ్డపై కాషాయం జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేష్ పటేల్, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, పాండుగౌడ్, రాజు, ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య, రవీందర్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

సృజనకు పదును.. భవితకు దన్ను

‘స్పార్కిల్స్’ పేరిట సమ్మర్ క్యాంప్

- రాష్ట్రంలోని పది కళాశాలల నుంచి హాజరైన విద్యార్థినులు
- ఆయా అంశాల్లో ప్రత్యేక తర్ఫీదు
- నేటితో ముగియనున్న శిక్షణ శిబిరం

మొయినాబాద్ రూరల్: సెలవుల్లో విద్యార్థినుల సృజనకు పదును పెట్టేందుకు.. వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించేందుకు వివిధ అంశాల్లో శిక్షణ నిస్తోంది మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల. ‘స్పార్కిల్స్’ పేరుతో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన వారికి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పది కళాశాలలకు చెందిన విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2, చేవెళ్ల, బంటారం, మోమిన్‌పేట్-1, మోమిన్‌పేట్-2, కోకట్, జహీరాబాద్, ఆమనగల్లు, మహేశ్వరం కళాశాలల నుంచి విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా లైఫ్ స్కిల్స్, మొబైల్ యాప్, హంటర్ ప్రీనియర్‌షిప్, యంగ్ జర్నలిజంపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తూ..

శిక్షణ శిబిరంలో ఆయా కళాశాలల విద్యార్థినులకు లైఫ్‌స్కిల్స్.. వ్యక్తిగత సంబంధాలను పెంపొందించుకోవడం.. ఇతరులతో ఎలా నడుచుకోవాలన్నదానిపై తరగతులు నిర్వహిస్తున్నారు.మొబైల్ యాప్స్, వ్యాపార సంబంధిత విషయాలపై అవగాహన కల్పించడం,పత్రిక రచనలు, వార్తా పత్రికల్లో వార్తలు, వ్యాసాలను సేకరించడం, రచించడం అనే అంశాలపై క్లాసులు నిర్వహిస్తు ప్రాక్టికల్‌గా చేసి చూపి స్తున్నారు.విద్యార్థులు ఉత్సాహంగా ఆయా అంశాలపై తర్ఫీదు పొందుతున్నారు. ఈ నెల 15న ప్రారంభమైన శిబిరం 29వ తేదీతో ముగియన్నట్లు కళాశాల సిబ్బంది తెలిపింది.



యంగ్ జర్నలిజంపై శిక్షణ

అన్ని రకాల సౌకర్యాలు



విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించడం కోసమే ప్రభుత్వం సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసింది. కళాశాలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశాం. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థినులు కూడా ఉత్సాహంగా శిక్షణ పొందుతున్నారు.

– రమాదేవి, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, చేవెళ్ల

క్లుప్తంగా

ఏప్రిల్ 1 వరకు గంగారం రైల్వేగేట్ బంద్

అనంతగిరి: ఎమర్జెన్సీ ట్రాక్ రిపేర్ కారణంగా శుక్రవారం ఉ. 6గంటల నుంచి ఏప్రిల్ 1 సా. 6గంటల వరకు వికారాబాద్‌లోని గంగారం రైల్వేగేట్ మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావునా, వికారాబాద్ నుంచి గోధుమగూడ, బూర్గుపల్లి, అంతారం, ద్యాచారం గ్రామాలకు వెళ్లే గ్రామాల ప్రయాణీకులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

స్నానానికి వెళ్లి..

వ్యక్తి మృతి



గోపాల్ మృతదేహం

పెద్దేముల్: సుద్ద గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పెద్దేముల్ మండల మారేపల్లి గ్రామానికి చెందిన బోయి నిహన్మప్ప- చంద్రమ్మల చిన్న కుమారుడు గోపాల్(34) బుధవారం పొలంలో పత్తి కట్టెలు వేరడానికి కుటుంబ సభ్యులతో పాటు గోపాల్ పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వస్తుండగా గోపాల్ స్నానం చేసి వస్తానంటూ పొలం పక్కనే ఉన్న తాండూరు ప్రాంతానికి చెందిన ఆసీఫ్ సుద్ద గుంతల్లో స్నానానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యు లు, గ్రామస్తులు సుద్ద గుంతల్లో వెతికారు ఫలితం లేకపోవడంతో ఇళ్లకు వెళ్లాడు. ఉద యం సుద్ద గుంతల వద్దకు వెళ్లి వెతకగా శ వం కనబడింది. దీంతో తండ్రి హన్మంతు ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గిరి తెలియచేశారు. మృతుడు గోపాల్ జహిరాబాద్ ప్రాంతం కొత్తూర్ గ్రామానికి చెందిన మహేశ్వరిని మూడు ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి ఓ కుమారుడు ఉన్నారు.

తల్లీపిల్లలు అదృశ్యం



లావణ్య, కుమారులు జశ్వంత్, కార్తీక్ (ఫైల్)

మొయినాబాద్: భర్త ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేసరికి ఇద్దరు పిల్లలతో సహా భార్య అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నమంగళారంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి శంకర్ ఈ నెల 26న ఫంక్షన్‌కు వెళ్లాడు. అదే సమయంలో ఆయన భార్య లావణ్య(35), కుమారులు జశ్వంత్(9), కార్తీక్(7) ఇంట్లోనే ఉన్నారు. ఆయన తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఎవరూ లేరు. దీంతో లావణ్యకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆయన గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తల్లీ కుమారుడు..



మంజుల, సందీప్ (ఫైల్)

కొందుర్గు: తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని పర్వతాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన మంజులతో కొందుర్గు మండలం దర్గా నర్సింలుకి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. అయితే నర్సింలు తరచూ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మంజుల చిన్న కుమారుడు సందీప్‌ను తీసుకొని షాద్‌నగర్ ఆస్పత్రికి వెళ్తానని బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం మంజుల తమ్ముడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

రోడ్లు బాగు ఊసేదీ?

- అధ్వానంగా రహదారులు
- వాహనదారులకు నరకయాతన
- నిద్రావస్థలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలు
- జిల్లాలో మొత్తం ఆర్‌అండ్‌బీ రోడ్లు 953 కిలోమీటర్లు
- గతేడాది పాడైన రోడ్లు 198 కిలోమీటర్లు
- టెండర్లు పిలిచినా ముందుకు రాని కాంట్రాక్టర్లు



వికారాబాద్ నుంచి దామగుండం మీదుగా పూడూరు వెళ్లే బీటీ రోడ్డు దుస్థితి

వికారాబాద్ : జిల్లాలో రోడ్లన్నీ ధ్వంసమయ్యాయి. అధ్వానంగా మారి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. ప్రతిపాదనలు పంపామని చెబుతున్న అధికారులు కనీసం వాటికి మరమ్మతులు కూడా చేయటం లేదు. దీంతో ఏళ్ల తరబడి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు స్పందించడం లేదు. ఎన్నికల సమయంలో తప్ప ప్రజాప్రతినిధులకు ఈ రోడ్ల దుస్థితి పట్టడం లేదు. వర్షాకాలంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు సంబంధించి ప్రతిసారి వివరాలు సేకరిస్తున్నాం.. ప్రతిపాదనలు పంపుతున్నామంటున్నారే తప్ప తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్లకు సంబంధించి మూడు నుంచి ఐదుసార్లు టెండర్లు పిలవగా ఒక్కరు కూడా ముందుకు రావడం లేదు.

గతేడాది నుంచి మరమ్మతులకు దిక్కులేదు..

జిల్లాలో గతేడాది కురిసిన వర్షాలకు పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్లకు సంబంధించి ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 198 కిలోమీటర్ల మేర రోడ్లు పాడైనట్లు అధికారులు నిర్వహించిన సర్వేలో తేలింది. వీటిని పూర్తిస్థాయిలో పర్మినెంట్‌గా బాగు చేయటం కోసం రూ. 89 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. అవి మంజూరై వచ్చే లోపు తాత్కాలికంగా మరమ్మతులు చేసేందుకు అవసరమైన రోడ్లను సైతం ఆ శాఖ అధికారులు గుర్తించారు. ఇందుకు రూ. 8 కోట్ల నిధులు అవసరమవుతాయని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. కాగా ఇందులో ఆర్‌అండ్‌బీ శాఖ 98 కిలోమీర్ల మేర పాడైన రోడ్లకు రూ. 39 కోట్లు మంజూరు చేసింది. ఇక పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి పాడైన రోడ్లకు రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. అయితే, ఈ రెండు శాఖల్లోనూ ధ్వంసమైన రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు, రోడ్లు మంజూరు, టెండర్ల ప్రక్రియ దగ్గరే పరిస్థితి ఆగిపోయింది.

అధ్వానంగా మెజార్టీ రోడ్లు

జిల్లాలో ఒకటి రెండు రోడ్లు మినహా మెజార్టీ రోడ్లు పాడైయ్యాయి. పలు మార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రావటం లేదని అధికారులు చెబుతున్నారు. అయితే, కొన్ని చోట్ల వారికి సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్లే కాంట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. పలుచోట్ల పనులు చేపడుతుండటంతో అవి పూర్తయ్యే వరకు టెండర్లు వేయకూడదనే ఉద్దేశంతో ముందుకు రావడం లేదని సమాచారం.

రహదారుల పక్కనే బోర్డులు

పట్టించుకోని అధికారులు



ధారూరు పోలీస్‌స్టేషన్ పక్కన ఏర్పాటు చేసిన 'టోయ్ టేస్ట్ ఆఫ్ వికారాబాద్' అనే బోర్డు

ధారూరు: పెట్రోల్‌బంకులు, ఆస్పత్రులు వంటి వాటి కోసం జాతీయ రహదారుల్లో అక్కడక్కడా బోర్డులు పెట్టడం సహజం. కాని, ఇటీవల కాలంలో రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాల వారు ఎక్కడ పడితే 4 నుంచి 1 కిలోమీటర్లు, 500 నుంచి 100 మీటర్ల పరిధిలో బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి పట్టణాలు, పెద్ద గ్రామాల్లో రహదారులకు ఇరువైపుల ఉన్న దుకాణదారులు బోర్డులను ఏర్పాటు చేసుకుంటారు. రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాల ముందు కాకుండా రహదారులపై ఏర్పాటు చేయడంపై ప్రజలు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో వెళ్తుంటే రోడ్ల పక్కన ఇలాంటి బోర్డులను చూసి పిల్లలు మరాం చేస్తున్నారని, పిల్లల భోజనాల కోసం వాహనాలు ఆపి భోజనం చేసి వెళ్లాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. రోడ్ల పక్కన బోర్డులను ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆర్‌అండ్ బీ శాఖ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అధికారుల అనుమతి తీసుకోవాలంటే నిర్ణిత ఫార్మెట్‌లో దరఖాస్తు నింపి తగిన రుసుం చెల్లించి బోర్డు పెట్టుకోవాల్సి ఉంటుంది. రహదారుల పక్కన ఏర్పాటు చేసిన బోర్డులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు రండి



బ్రహ్మోత్సవాల పత్రిక ఇస్తున్న ధర్మకర్తలు

కొడంగల్ : శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని ఆలయ ధర్మకర్తలు సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసానికి వెళ్లి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేశారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తిరుమల తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా ఉత్సవాలు జరుగుతాయని ధర్మకర్తలు వివరించారు. నిత్య వాహన సేవలు, కై ంకర్యాలు, పూజలు, సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణ ఉంటుందన్నారు. స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏప్రిల్ 8వ తేదీన జరిగే ఉత్సవాలకు వస్తానని చెప్పారు. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడానికి సీఎం స్వయంగా వస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్తా, ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్, రత్నం, రాజేందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మూడు రోజులుగా వస్తున్నాం..



పోస్టాఫీసు వద్ద పింఛన్ల కోసం ఆందోళన చేస్తున్న వృద్ధులు

- పింఛన్లు ఇవ్వడం లేదు
- మోమిన్‌పేట్ పోస్టాఫీసు వద్ద వృద్ధుల ఆందోళన

మోమిన్‌పేట్: మూడు రోజుల నుంచి పింఛన్ల కోసం పోస్టాఫీసు వద్ద పడిగాపులు కాస్తున్నా ఇవ్వడం లేదని లబ్ధిదారులు గురువారం పోస్టాఫీసు ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఉ. 9 గంటల నుంచి సా. 5 గంటల వరకు నిరీక్షించినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. నిరసన వ్యక్తం చేయడంతో లబ్ధిదారులు, అధికారులు, సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. చివరకు ఓ అధికారి కల్పించుకుని మిషన్ పనిచేయడం లేదని, ఇతర గ్రామాలకు తీసుకెళ్లారని చెప్పడంపై పింఛన్‌దారులు మండిపడ్డారు. వికలాంగులమైన మేము వివిధ గ్రామాల నుంచి ఆటోల్లో వచ్చి నిరీక్షిస్తున్నమని, మీరేమో మిషన్ పనిచేయడం లేదని, ఇతర గ్రామాలకు తీసుకెళ్లారని చెప్పడం భావ్యంగా ఉందాని ప్రశ్నించారు. సాకులు చెప్పడం మాని, వెంటనే పింఛన్లు ఇవ్వాలని డిమాండు చేశారు.

కడుపునొప్పి భరించలేక..

వ్యక్తి ఆత్మహత్య

తాండూరు రూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. తాండూరు మండలం వీరారెడ్డిపల్లికి చెందిన నాగారం వీరేశం(48), గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నారు. గురువారం నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: కుటుంబ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని ఇస్రాయిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణ(55) రోజూ కుటుంబ వ్యవహారాలతో సతమతమయ్యేవారు. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఓ పొలంలో పురుగుల మందు తాగి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున కృష్ణ మృతి చెందాడు. మృతుడికి భార్య యాదమ్మతో పాటు, ఓ కుమారుడున్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



కవిత (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్ మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో పిగ్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి కవిత(40) కుమార్తె వైష్ణవితో ఈ నెల 21న ఫోన్లో మాట్లాడారు. అదే రోజు సాయంత్రం మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుండడంతో మరుసటి రోజు ఇంటికి వచ్చి ఆమె చూడగా తాళం వేసి ఉంది. తల్లి రాకపోవడంతో వైష్ణవి బంధువులకు వాకబు చేయగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుర్చీలు లేవు.. బెంచీలు లేవు



బస్టాండు ఆవరణలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ధారూరు: మండుతున్న ఎండలు.. తాగడానికి నీళ్ల లేవు.. కూర్చోవడానికి కుర్చీలు లేవు.. బెంచీలూ లేవు. నిలబడి నిరీక్షించే ఓపిక నశించి బస్టాండు ఆవరణలోకి చేరి నీడలో నిల్చున్నా వీరంతా ప్రయాణీకులే.. వేళకు రాని బస్సుల కోసం రోడ్డుపై నిలబడితే ఎండ దెబ్బకు సొమ్మసిల్లిపోయే ప్రమాదం ఉండవచ్చనే భయంతో బస్టాండులోకి వచ్చి బస్సుల కోసం నిరీక్షిస్తూ ఇలా నిలబడ్డారు. వీరంతా గురువారం ధారూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు. వేచి చూడటం గమనించిన సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.

సొసైటీ ఆధ్వర్యంలో కొత్త రైస్‌మిల్

నావంద్గి సొసైటీ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి

బషీరాబాద్: నవాంద్గి సొసైటీ ఆధ్వర్యంలో నెల రోజుల్లో కొత్త రైస్‌మిల్ ప్రారంభిస్తున్నట్లు సహకార సంఘం చైర్మన్ అల్లాపురం వెంకట్‌రాంరెడ్డి అన్నారు. గురువారం కార్యాలయంలో సొసైటీ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే గోదాంను కూడా రైతులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పాత భవనం కూల్చి కొత్తగా గోదాం నిర్మిస్తామని చెప్పారు. రైతుల ధాన్యం నిల్వలకు ఉపయోగపడుతుందని తెలిపారు. సొసైటీలో బంగారంపై రైతులకు తక్కువ వడ్డీరేటుతో రుణాలు ఇస్తున్నామని, ఇతర బ్యాంకుల కంటే ఎక్కువగా తులం బంగారానికి అత్యధికంగా రూ. 45 వేలు ఇస్తున్నామని వివరించారు. సొసైటీ చేపట్టిన పలు కార్యక్రమాలు, సిబ్బంది చొరవతో రూ.28 లక్షలు సొసైటీ ఆర్జించిందన్నారు. మండలంలో ఇప్పటివరకు రైతులకు రూ. 8.33 కోట్ల పంట రుణాలు ఇచ్చామని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి , అశోక్ గౌతమ్ , రంగారెడ్డి, గోపాల్, నవీన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, సీఈఓ బందెప్ప, రాజశేఖర్ ఆయా గ్రామాల రైతుల పాల్గొన్నారు.

పెళ్లికి వెళ్లి వస్తూ..

ఒకరు మృతి, ఇద్దరి తీవ్ర గాయాలు



కుర్వ మల్లప్ప మృతదేహం



నుజ్జయిన ఆటో ముందు భాగం

యాలాల: ఎదురెదురుగా వస్తున్న ఆటో, జీప్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బషీరాబాద్ మండలం దామర్‌చెడ్‌లో ఓ పెళ్లికి హాజరయ్యేందుకు తాండూరు, జుంటుపల్లి గ్రామాలకు చెందిన ఆరుగురు ఓ ఆటోలు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో లక్ష్మీనారాయణపూర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న జీపు వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో ఆటో ముందు కూర్చున్న కుర్వ మల్లప్ప(40), మృతి చెందగా వెంకటయ్య, చంద్రకళకు తీవ్ర గాయాలయ్యాయి. మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యాలాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శునకం అడ్డొచ్చి.. విషాదం మిగిల్చి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు



లక్ష్మమ్మ (ఫైల్)

కొందుర్గు: శుభకార్యానికి వెళ్తున్న వదిన, మరిది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో వదిన మృతి చెందగా.. మరిదికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళ్లపూర్ గ్రామానికి చెందిన భీమయ్య తన వదిన లక్ష్మమ్మ(55)తో కలిసి జడ్చర్లలో బంధువుల పెళ్లికి గురువారం ఇంటి నుంచి బయలుదేరారు. కాగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్ నుంచి ఇద్దరు పడిపోయారు. ఈ సంఘటనలో లక్ష్మమ్మ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. భీమయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా లక్ష్మమ్మ మృతి చెందారు. భీమయ్య శంషాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై మృతురాలి కుమారుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొందుర్గు: ఎదురెదురుగా వస్తున్న బైక్, కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం శ్రీరంగాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన సురేష్‌గౌడ్ మోటార్ సైకిల్‌పై షాద్‌నగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు శ్రీరంగాపూర్ వద్ద బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న సురేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై సురేష్‌గౌడ్ బంధువు లింగంగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

వడ్డీ వ్యాపారికి రిమాండ్

- డబ్బులు చెల్లించలేదని ఇంటికి పిలిచి దాడి
- దాడి వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



పోలీసుల అదుపులో నిందితుడు రవి, చిత్రంలో సీఐ సంతోష్ కుమార్

తాండూరు టౌన్: ఈ నెల 22న వడ్డీ చెల్లించలేదంటూ ఓ ఆటోడ్రైవర్‌పై దాడి చేసి, వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసిన వడ్డీ వ్యాపారి రవిని గురువారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ సీఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు.. రాజీవ్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ బాలయ్య, ఇందిరానగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి మ్యాదరి రవి వద్ద రూ.5 వేలు అప్పు తీసుకున్నాడు. నెలకు రూ.500 చొప్పున రెండు నెలలు వడ్డీ చెల్లించాడు. పరిస్థితుల ప్రభావం వల్ల ఒక నెల వడ్డీ చెల్లించలేకపోయాడు. దీంతో సదరు వడ్డీ వ్యాపారి బాలయ్యను తన ఇంటికి పిలిచి అమానుషంగా దాడి చేసి, అతని కొడుకు చేత వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఇది వైరల్ కావడంతో పాటు బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో రవి పరారీ అయ్యాడు. గురువారం అతడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

యువత క్షణికావేశానికి గురికావొద్దు

మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత జీవితాలను గడపాలని మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా పోలీసు కవాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల వేళ ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో క్షణికావేశంలో గొడవలు పడి జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. ప్రధానంగా చదువుకున్న యువత మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అదే విధంగా ప్రభుత్వం కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఓటింగ్ సమయంలో ప్రలోభాలకు గురి కావొద్దన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకట సత్యనారాయణ, ఏసీపీ కేపీవీ రాజు, సీఐ బాబ్యానాయక్, ఎస్సైలు లాలయ్య, రవినాయక్, ఏఎస్సై సతీష్, నాయకులు రమేష్, భాస్కర్, జంగయ్యగౌడ్, శంకరయ్య, ఐలయ్య, రాజు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో వేంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ పీఈటీ మల్లేశ్ గురువారం తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సుమారు 60 టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని తెలిపారు. స్త్రీ పురుషులకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులకు భోజన సదుపాయం ఉంటుందని చెప్పారు.

సీఎం రాకతో భారీగా ట్రాఫిక్

హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై వాహనదారుల ఇక్కట్లు

చేవెళ్ల: సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో చేవెళ్ల మీదుగా కొడంగల్ వెళ్లడంతో హైదరాబాద్-బీజాపూర్ రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. గురువారం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల మీదుగా కొండగల్‌కు వెళ్లారు. జాతీయ రహదారి అయినప్పటికీ విస్తారణకు నోచుకోకపోవటంతో ఇరుకుగా మారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోజూ ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. అలాంటి రోడ్డుపై రాష్ట్ర సీఎం వస్తుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు పెద్దఎత్తున బందోబస్త్ ఏర్పాటు చేశారు. మొయినాబాద్, చేవెళ్ల మండలాల పరిధి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకవైపు ఎండలు మండిపోతుండటంతో ప్రయాణికులు రెండు గంటల పాటు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి. ముఖ్యమంత్రి ఈరోడ్డుపై దృష్టి పెట్టి విస్తరణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరారు.